

# 16 కాదు సుమా కల కాదు సుమా

స్టేషన్నించి తాలూకా కచేరిదాకా రాచబాట. మీద రాత్రివేళ దీపం లేకుండా సైకిలు తొక్కుకుపోయి ఇల్లుచేరిన సుబ్బారావు, బండిదిగ్గానే ఆ వైనం గమనించి 'హరినీ' అని ఆశ్చర్యపోయి నవ్వుకున్నాడు.... మార్కెట్‌లో నిల్చున్న ధరలు, ఉట్టిసంబరంలో వాడిలా ఊతం కోసం అన్నట్టు ఒక్కసారి కిందికి దిగి ఊపుతో పైకెగిరాయి. ఎగిరి అలాగే వేళాడుతూ ఉండిపోయాయి.... 'మా ఆఫీసరు పీనుగ మారిపోయేడోయ్! తిట్టడం మానేశాడు బొత్తిగా. ఆ ఉగ్రవేఁ లేదు. సుబ్బరంగా నవ్వుతున్నాడు. పల్లీకున నాతో చనువుగా మాట్లాడుతున్నాడు' అన్నాడు పరంధామయ్య మార్కు పరంధామయ్య... "ప్రెస్సు వర్కు రెక్కడా దొరకడం లేదండీ" అన్నాడు ప్రెస్సాయన... "సెట్టీ నువ్వు శనగపిండి ధర పెంచేస్తే నేను పకోడీల ధర పెంచలేనని కదూ నీ అహం? రేపు బేడిచ్చి మనిషిని పంపు. పొట్లంలో పకోడీలెన్నుంటాయో చూడు" అన్నాడు పకోడీల నారాయణ.... "పొరుగూరి పాలకావిళ్ళ బారు పొడుగయిందే" అన్నాడు అరుగు మీద దంతధావనాని కూర్చున్న ధర్మారావుగారు... చెరువులో తాబేలు పైకి తేలి బయటికి తలసారించి నాలుగు దిక్కులా పరకాయించి చూసి 'జగన్మిథ్య' అని చప్పరించి తల ముడుచుకుని చెరువులోకి వెళ్ళిపోయింది... తాబేలుకు సంబంధించినంతవరకూ ఆ అభిప్రాయం సత్యమా కాదా అని రివాజుగా చర్చించే సుబ్బయ్యగారు కర్ణంగారి మనిషిని చూసి మునసబుగారింటికి పరుగెత్తాడు... మెయిన్ రోడ్డు ముస్తాబైంది... పక్కరోడ్లకి రిపేర్లారంభం అయ్యాయి. గవర్నరు గారొస్తున్నారని కొందరూ, మినిస్టరుగారింట దిగుతారని కొందరూ, కాదు పార్టీ ఆఫీసని మరి కొందరూ ఊహాగాన సభలు చేశారు... బ్రహ్మాండమైన వర్షం వచ్చి అవుతూ అవుతున్న రిపేర్లను రద్దు చేసింది. ఈ విషయంలో బాధ్యత అపోజిషన్‌లో వాళ్ళదేనని పొజిషన్‌లో వాళ్ళన్నారు. మేష్టారు సావిట్లో కూర్చుని రాజీనామాలు చదువుతూ నెహ్రూని తీవ్రంగా ఖండిస్తున్నాడు. "నాన్నగారు కోపంగా ఉన్నారు. నెహ్రూని కోప్పడుతున్నారు. అల్లరి చేయకండి" అని పిల్లల్ని సర్దింది అర్ధాంగి.... ఖదేరావు బ్రదర్స్ వారు వైటమిన్ టానిక్కుల ధరలు పెంచేశారు.... ఎన్నికల వాగ్దానాలూ టానిక్కులు తింటున్నారు గదండీ, మరి గిరాకి పెరగలేదూ?" అన్నారు వారు చమత్కారంగా.... అపరిమిత మితభాషి,

ఆ మాటకొస్తే మౌని అని పేరున్న గుమాస్తా సుబ్బన్నగారు నాలుగేళ్ళ తరువాత ఇన్నాళ్ళకీ వీధరుగెక్కి సోషలిజాన్నీ, జవహారీలాలునీ చెరిగేసి బాకీ అడగొచ్చిన పాలవాణ్ణి హడలగొట్టేశారు.... ఇది విని, పొరుగింటి కుటుంబరావుగారు పెట్లోంచి కలరా వుండల కంపు కొడుతున్న అభిప్రాయాలను పైకితీసి పెరట్లో ఎండేశారు. హడావిడిగా.... "నేనేం నెహ్రూనిగాను. సరిహద్దులు జరిపిస్తే ఊరుకుందుకు" అంటూ ఉమ్మడి సావిట్లో పొరుగు వాటాదారు రాత్రి గీసిన గీతను చెరిపి జరిపారు నరహరిగారు. తుమ్మాయీ, జగ్గాయీ గజంబద్ద మింగేసినట్టు నిటారుగా దర్జాగా నడుస్తున్నారు. "వెన్నెముక లెలా ఇస్తున్నార్రా ఇపుడూ? చవకేనా?" అన్నాడు తుమ్మాయి నవ్వి. "నువ్వు కొన్నవాటికన్న ప్రియమే లేవోయ్" అన్నాడు జగ్గాయి. "ఏఁవి నీ బేహద్బీ! వుండు మా రెడ్డిగారు ఫవరు కెక్కనీ" అని పరిగేరు కెళ్ళిపోయాడు తుమ్మాయి... చిల్లర మార్కెటులో న్యూసుప్రింటు ధర పెరిగింది. రంగుల ధరలు ఎదిగాయి. తాను గుడ్డల ధరలుసై అన్నాయి... మునిమాపువేళ, ఊరి చివర డేరా హోలుకి అసింటా ముసలి మృత్యుంజయరావుని పట్టుకు నిలేసి, "నువ్వు నిజంగా బతికే ఉన్నావు ఒట్టు" అంటూ నిర్దాక్షిణ్యంగా – అతను బతికున్నాడనడానికి నూటొక్క దాఖలాలు చూపి నచ్చ చెబుతున్నారు పంతులుగారు. ఇంకో క్షణం తరువాత మృత్యుంజయరావు పల్చగా నవ్వి చెట్టుకొమ్మ కెగిరి కూర్చుని "సర్లే నా ఓటు నీకే" అంది. పంతులుగారు విజయగర్వంతో ఇంటికి సాగిపోయారు.

"ఎలక్షను ఋతు వొచ్చినట్టుందే" అన్నాడు రామిరెడ్డిగారు.

సుబ్బరాజు చిరునవ్వు నవ్వి కూర్చున్నాడు.

"తనదే ఆలీశం" అన్నాడు ఓ క్షణం ఆగి.

రెడ్డిగారు పగలబడి నవ్వారు. నవ్వుకు కారణం అంతుబట్టలేదు సుబ్బరాజుకి, అప్రయత్నంగానే బొమముడి పడింది.

రెడ్డిగారు తమాయించుకున్నారు. "నివ్వన్న మాటక్కాదులే నవ్వుతాలు. ఓ కత గుర్తుకొచ్చి నవ్వాను" అంటూ కండువాతో కళ్ళొత్తుకుని ముఖం తుడుచుకున్నారు. "ఇదిగో ఈన చెప్పారు. పేరు రావుగారు. మళ్ళీ ఆయనే చెప్తారు విను" అన్నారు.

"నవ్వు నాలుగిందాల చేటన్న వాళ్ళకి – అతిశయోక్తులంటారే – అవి బొత్తిగా చేతగావు (అంటూ కథ ఆరంభించారు రావుగారు) బోర్డు స్కూలు మేష్టరు రావనరసుగారు ఓనాడు పొద్దున్న రివాజు ప్రకారం మరో ఇంట ఎరువు తెచ్చిన చెంబు సంచిలో వేసుకుని, తాకట్టేసి రూపాయి తెచ్చుకుందుకు బయల్దేరారు. వెళ్ళినవారు ఘంటయినా రాలేదు. రెండు ఘంటలయినా రాలేదు. ఇంట్లో పిల్లలూ, పెరట్లో కాకులూ ఒకటే గోల. పొరుగావిడ అప్పుడే మూడుసార్లడిగింది. "ఇంకా మడి కట్టుకోలేదా వదినా" అని. ఆ వరసకొట్లల్లో పిల్లులన్నీ ఏడుగంటల మీటింగు ఆరంభించిగంటయింది. రావనరసు గారింటి పొయిలో పిల్లి ఎప్పుడూ లేటే. 'మహాబద్ధకం' అంది ఓ తల్లి. 'లేటేమిటి? వారానికోటి రెండ్రోలు గైరు హాజరవుతూంది' అంది ఓ కూన. "ఇదేం బావులేదు. మనందరినీ ఆరో ఘంటకల్లా లేవగొడుతున్నారు. నరుసుగారి పిల్లి ఒకర్తే ఇలా సుఖపడ్డం నాకేం నచ్చలేదు" అందో మార్జాలం ఉద్రేకంగా. నరసుగారి చంటివాడు – పెరట్లో ఆడుకుంటూన్నవాడు ఈ మాటలూ నవ్వులూ విన్నాడు. వాడి కింకోలా అర్థమైంది. పౌరుషం వేసుకొచ్చి

గబగబ వంటింట్లోకి డేకి వెళ్ళి, పిల్లిని లేవగొట్టి 'ఫో. వెళ్ళి రచ్చలో కూర్చో. ఇంట కూర్చుని మా పరువు తీస్తున్నావు' అని కేకవేశాడు. పిల్లి హడలిపోయి పిల్లి అయిపోయి మెల్లిగా చక్కాపోయింది పెరట్లోకి. ఆఖరిసారి ప్రయత్నిద్దామని గరిట పట్టుకొని పెరటిగోడ దగ్గరకొచ్చి 'వదినా కాస్త నిప్పెడతారా' అని అడగబోయిన పొరుగావిడ పిల్లిని చూసి గరిట దాచేసుకుని 'మడి గట్టేసుకున్నట్టున్నారే' అని జనాంతికంగా అని చిన్నబుచ్చుకుని లోపలికి చక్కాబోయింది....

రామనరసుగారి అర్ధాంగి సావిత్రమ్మగారు కంగారుగా నాలుగు చిత్తుకాయితాలు కుంపట్లో తోసి కోడిగుడ్డు దీపం తెచ్చి చీపురుపుల్లతో అవి ముట్టించి వంటింటి బార్లా తలుపు తీసి నట్టింటి తలుపు జేరేసే వరకు బయటెవరో 'తలుపు తలు'పన్నారు. భర్త కాదు. 'ఎవరు తలుపూ' అంది సావిత్రమ్మగారు. 'తలుపు తియ్యండమ్మా' అన్నారు అవతలి మనిషి. 'వీల్లేదు. చిన్నగుడ్డ కట్టుకుని ఉన్నాను' అంది ఇల్లాలు. 'సర్లెండి. పెద్దది కట్టుకు రండమ్మా, రాచకార్యం ఒచ్చిందీ' అన్నాడు తలుపు మనిషి. ఆవిడ మాటాడలేదు. 'అప్పలాణ్ణి కానులెండి' అన్నాడాయన. 'మా అమ్మకి చీరలేదు వ్వావ్వాన్నోరు నొక్కుతావేం' అన్నాడు నరసుగారి మూడోవాడు. 'మళ్ళొస్తా' అంది తలుపు. వరలక్ష్మి వ్రతం కథ తలుచుకుని కంట నీరు తుడుచుకుని నవ్వింది సావిత్రమ్మగారు. ఇంకో గంట తరవాత 'తలుపు తలుపోయ్ తలుపు' అంది తలుపు. 'ఎవరదీ' అంది సావిత్రమ్మగారు. 'నేనే' అంది తలుపు ధీమాగా. 'కాదు సుమా కలకాదు సుమా' అంది. కంఠం విని తలుపు దీయబోయిన ఇల్లాలు పాట విని జంకింది. 'తియ్యవోయ్' అంది తలుపు చనువుగా. తియ్యగానే 'లాలలలా' అంటూ లోపలికొచ్చారు నరసుగారు. 'కాదు సుమా కలకాదు సుమా' అన్నాడు భార్యకేసి, పిల్లడి బుగ్గమీటి. ఆవిడ బెదరిపోయి తలుపు గడీవేసి 'ఏవిటండీ' అంది. 'కాదు సుమా కల కాదు సుమా. నీళ్ళు తోడు సుమా. అర్జెంటు సుమా' అన్నారాయన.

'నా దేవుడోయ్ నేనేం చేతు బాబోయ్' అంటూ నోరు నొక్కుకుని కూలబడిపోయింది సావిత్రమ్మగారు. నరసుగారు ఆవిడకేసి జాలిగా చూసి, నవ్వి పాట కొనసాగించారు. బట్టలు విడిచి విసిరిగొట్టి తువ్వాలు చుట్టి 'లాలలలా' అన్నారు. పిల్లలు దిక్కుచచ్చిపోయి ఎక్కడి వాళ్ళక్కడ గోడ కంటుకుపోయారు. నరసుగారు ఒక్కక్షణం తేరిపార చూసి వాళ్లకి కితకితలు పెట్టారు. చంటి వెధవ మటుకు నవ్వాడు. 'వెధవా! హేళనగా నవ్వుతున్నావా' అని పిర్రమీద ఒక్కటంటించడంతో వాడూ సోదర బృందంతో శ్రుతి కలిపాడు. నరసుగారు పెరట్లో కెళ్ళి నీళ్ళోసుకోబోయేవరకు 'అబ్బే. ఆయన పాట నుంచి కాదు. గ్రాంఫోను ప్లేటే అయుంటుంది' అని వినబడింది గోడవతల. 'గ్రాంఫోనయితే అలా ఏడిసినట్టుందే....' 'ప్లేటు అరిగిపోతే అలాగే వస్తుందిలే'... 'అబ్బే ఆ ఇంటినిబట్టి అలా వస్తుంది'.

'కాదు సుమా కల కాదు సుమా' అని గట్టిగా పాట అరంభించి నీళ్ళోసుకున్నారు నరసుగారు. లోపలి కెళ్ళి అటక మీద పెట్టె దించి అందులో పెళ్ళినాటి సూటు తీసి తొడుక్కున్నారు. "సూటు కొంచెం పెరిగిందే" అన్నారు గుడ్లప్పగించి చూస్తున్న భార్యని చూసి. "ఏ వుందిలే పై నించి వాన కురుస్తూంది గదా? వాటర్ సప్లై అన్నమాట. గవర్నమెంటుకి చెప్పకు. వాటర్ సెస్సు వేస్తారు" అన్నారు ఇంకో క్షణం ఆగి.

"లేపోతే ఇంకో కారణం ఉండవచ్చు. నా మ్యూజికు వల్ల కూడా పెరిగుండవచ్చు. సంగీతంతో పంటలు పెరుగుతున్నాయట. సూట్లు కూడా వృక్ష జనితాలే గావున...." అంటూ ఆగిపోయారు. "అన్నట్టు పన్ని, పన్ని కావాలి. తల దువ్వాలి. పన్నీ, అద్దం అందుకో" అంటూ గూట్లో దువ్వెన తీశారు. "అమ్మీ, పాపి డెటేపు తీసేవాణ్ణో గుర్తుందా?.... మాటాడవేం? ఓరీ సుబ్బిగా, నీకు జ్ఞాపకం ఉందా? నీ మొహంలే. ఒరే రావుడూ, నువ్వు చెప్పరా. నువ్వు అప్పటికి పుట్టినట్టున్నావు... వెధవా ఇదే గుర్తు లేపోతే ఎక్కాలెలా వస్తాయి? ఏడు - ఓహో ఇందాకట్నించీ ఏడుస్తున్నావు గదా. అయితే నవ్వు. నవ్వుతావా లేదా? డొక్క చీరేస్తా వెధవా! అద్దమెక్కడఘోరించింది? లేదా, పక్కింటో అడిగి పట్రా.... వద్దులే, ఆ వెధవలు దాని వెనక కెమెరా పెట్టి పమ్మిస్తారు. మన మొహాలకి అద్దంతో పనేవంత వచ్చిందాని, వెధవలు ఒకళ్ళు బాగుపడితే చూళ్ళేరు.... అయ్‌మీన్ చూడాలని ఉబలాటపడతారు. అద్దమెందుకూ? ఓరీ వెధవల్లారా? మీరంతా కళ్లు మూసుకోండిరా... నేను తల దువ్వుకోవాలి. అమ్మీ. ఏదీ నీ చెంప ఇలా చూపెట్టు. అద్దంలా పట్టు. అందులో చూసి పాపిడి తీసుకుంటాను... హారినీ ఇదేవిటే? నీ చెంపలే ఇవి? ఏవి? చెంపలేవీ? వాట్లో కెంపులేవీ? తాకట్టేసి ఇల్లు నడుపుతున్నావా? పోన్లే కళ్ళు తెరూ, వాటిలో చూసి పాపిడి తీసుకుం.... ఏడిస్తే ఎలా? బొమ్మ కనబడదు. డామిట్... కళ్ళు మరీ అంత లోతయితే ఎలా? బైనాక్యులర్స్ పెట్టి చూడాలి కాబోలు. అసలే చెత్వారపు జోడు లేదు. ఎందుకులే, చవగ్గా అద్దమే కొనవచ్చు - లేపోతే డామిట్ అమ్మీ - ఎంత భయంకరమైన ఆలోచనొచ్చింది తెలుసా? ఒక్కలెంపకాయ కొడితే - నీ చెంప వాస్తే, అది అద్దంలా మెరిస్తే అందులో చక్కగా పాపిడ తీసి నీటుగా ముస్తాబయి... ఛఛ నా నాలిక తెగ - ఎంతమాటన్నాను. ఏవనుకోకేం? జీవితంలో రివాజిది. ఏమిటే? మందా? ఇప్పుడా? ఇంత లేటు వయసులోనా? .... ఆసినీ, అదా అనుమానం? చూడు నమ్మకం కుదిరేదాకా వాసన చూడు. నేను జన్మలో అలాంటి పని చేస్తానా? - రామ రామ. నేను నిజంగా ఆనందంగా ఉన్నాను. ఇది నిజం ఆనందం. సత్తుది కాదు. ఇన్నాళ్ళూ మన బతుకులు సత్తు బేడలనుకున్నాం. దొంగ నోట్లనుకున్నాం. కావుట. కావు కావు అని కాకులన్నీ కూస్తున్నాయి రాజవీధిలో. నీకేం తెలుసు. దేశం పెరుగుతోంది. సరిహద్దులు తరుగుతున్నాయనుకో. పైకి పోతూంది. చైనాలోకి కాదు.... నిజంగా పైకి. దేశమంటే మట్టి కాదు. అంచేత చైనా గురించి బాధపడకు. దేశమంటే మనుషులు, మనుషులంటే గొప్పవాళ్ళే కాదు. అందరూనుట. గొప్పవాళ్ళు మనుషులు. మనం మనుషులం. అంచేత మనం గొప్పవాళ్ళమే. లాజిత్తులో కొంచెం తికమకపడ్డాం. పావర్టీ ఈజ్ క్రైమన్నాడు ఓ గొప్ప గడ్డపాయన. ప్రాపర్టీ ఈజే క్రైమన్నాడు మరో గడ్డపాయన. తేల్చుకుందు కాలీసవయిందంతే. ఇవిలాగే ఉంటాయి. చట్టం ప్రకారం - కావాలని చావడం క్రైము. సిద్ధాంతం ప్రకారం ఇంక పుట్టడం కూడా క్రైమే - కొందరు బతకడం క్రైము - కొందరికది కంటకం కాబట్టి. అందుకే నువ్వూ నేనూ ఇన్నాళ్ళూ గట్టిగా బతికి బట్టకట్టడం లేదు. ఇవాళనించి సూటేశాననుకో. కాని కొందరు బతక్కపోడం కూడా క్రైమే - కొన్ని పల్లకీలు, పనులు ఆగిపోతాయి. తాజమహాళ్ళ రాళ్ళ రవాణా లాగిపోతాయి. అందుకే మనం చచ్చినట్టు బతికున్నాం.

ఇవాళ్నించి కొత్తదారి. కాదు సుమా కల కాదు సుమా. ఒట్టు నేను తాగలేదు. అంత నీచాని కొడిగట్టలేదు. కాదు సుమా కల కాదు సుమా. ఇదుగో రూపాయి. రాజాలా బంగాలా దుంపలు వేయించి, పప్పు పులుసు పెట్టు. టాటా లాలా మళ్ళీ వస్తా – ఫొటో తీయించుకొస్తా."

బయల్దేరబోయిన నరసుగారికి నిస్త్రాణ కమ్ముకొచ్చింది. 'మంచినీళ్ళందుకో' అన్నాడు గోడకి జేరగిలబడి. సావిత్రమ్మగారు దిగ్గున లేచి దాహం తెచ్చిచ్చింది. చెంగు తడిపి .మొహం తుడిచింది. పాపిడతీసి తల దువ్వింది. గుడ్ల నీరు కుక్కుకుంది.

"ఛా ఛా ఏడుపెందుకు? కలకంఠి కంట కన్నీరొలక సిరి యింట నుండ నొల్లదన్నారు. ఎలాగా ఉండల్లేదనుకో నువ్వేడిస్తే ఇదుగో ఇందుకూ లేను అని వంక చెబుతుంది. ఏడవకు – కితకితలు పెట్టనా, అఁ గుడ్. అలాగే నవ్వు. అదే నవ్వు... వస్తా.... అబ్బే పడుకోను ఒంట్లో దివ్యంగా ఉంది. కాదు సుమా కల కాదు సుమా" అంటూ లేచి చెంగున గుమ్మంవేపు గెంతి 'తలుపేసుకో' మని వీధిని పడ్డాడు నరుసుగారు.

ఇంకో గంటలో వూరు కోలాహలం అయిపోయింది. నరసయ్యకి పిచ్చెక్కిందన్నారు. ఎన్నడూ లేనిది అంతలా నవ్వడ మేమిటన్నారు. పైగా పాటలోటి అన్నారు. పలకరించి చూసినవారు 'అబ్బే పిచ్చి కాదండీ' అన్నారు నిరాశగా పెదవి విరిచి. 'కాదు సుమా కల కాదు సుమా' అన్న దేదో బైస్కోపు పాటగాదూ, ఆ పోదూ అదేనాటిదో... 'ఇన్ని పాటలుండగా అదే ఏల పాడాలి? ఇందులో ఏదో కిటుకుంది? ఎవర్నో వెక్కిరిస్తున్నాడు.' .... 'ఛ ఒకరి జోలికి శొంఠికీ రాడు... అన్నట్టు శొంఠంటే గుర్తొచ్చింది. వాళ్ళింటో వంట రెండ్రోలుకోమాటు చేసుకున్నా కోవటింట శొంఠీ, వాము మాత్రం కొంటారు తరచూ.... ఎందుకమ్మా అంటే పిల్లల కజీర్తి అంటుందిటావిడ. మా ఆవిడ చెబుతూంది లెండి పొరుగిల్లేగా "హోహో"... "జిల్లా బోర్డు వాళ్ళు జీతాలిస్తానన్నారేమో' అన్నాడు మీటింగులో వక్త. "అఁ వాళ్ళకిదే పనేవిటి" అన్నాడు బోర్డుగారి బావమరిదో, మేనల్లుడో పౌరుషంగా. "మాట వరసకంటే మీకంత కోపమెందుకు? ఎలక్షనులు గదా బకాయిలిచ్చేసి, ఏ ఫిబ్రవరి దాకానో నెల్నెలా ఇస్తారేమోనని అనుకున్నా" అన్నాడు మొదటాయన. "ఎలక్షన్లొస్తే జీతాలిస్తారేవిటి?" అన్నాడొక ప్రజ. "బలే వాడివోయ్. మరివ్వరూ?" అన్నాడు జ్ఞాని. "అయితే ఇహనేం నెలనెలా ఎలక్షన్లు పెట్టించేస్తే సరి" "మేం బతుకుతాం... నీ పుణ్యవుంటుంది ఆ పని మటుకు చేయించకండి.... మీరిలా వెర్రిబాగుల మేష్టర్లని రెచ్చగొట్టి పబ్లీకున నవ్విస్తే చివర కలాగే అవుతుంది..." "ఐనా ఆ నవ్వు మిమ్మల్ని చూసే అని బుజాల్తడూకోడవెందుకూ? ఆయన కో రూపాయి అప్పు దొరికిందేమో?".... "అడుగో ఆయనే వస్తున్నాడు అడిగితే సరి...."

'కాదు సుమా కల కాదు సుమా, కాహదు సుమా కాహదు సుమా – ఖలక్వాహదు సుమా' అని మటుకే సరాగంగా చెప్పి హడావిడిగా వెళ్ళిపోయాడు నరసుగారు.

ఆ మర్నాడు ఆయన నవ్వు, పాట, పెద్దల దాకా వెళ్ళాయి. మూడోనాడు వార్తాపత్రికలలో బాక్సుకట్టి వేశారు.

"రామనరసుగారనే ఒక మధ్య వయసు మధ్యతరగతి మనిషి హఠాత్తుగా మొన్న

ఉదయం పది గంటల నుండి నవ్వుతూ ఊరంతా తిరగడం ఆరంభించాడు. నవ్వుకు కారణం తెలియరాలేదని తెలుస్తున్నది. ఆయన ఓ సూటు వేసుకున్నాడనీ, అది ఎవరో ఎలక్షను సందర్భంగా కుట్టించారనీ చెప్పుకుంటున్నారు. ఎవరైనదీ తెలియలేదు..."

నాలుగోనాటికి రేడియోలో టూకీగా వార్త వచ్చింది. ఐదోనాడు పత్రికలలో మొదటి పుట మీద కనబడిందా వార్త. ప్రజలు తండోప తండాలుగా వెళ్ళి ఈ వింత చూస్తున్నారని చదివి ప్రజలు తండోపతండాలుగా వెళ్ళి చూడసాగారు. చాలామంది లాటరీ కంపెనీలలో వాకబు చేశారు. సి.ఐ.డి. పోలీసులు పెరడూ, లోపలి గదులూ తనికీ చేశారు లంకెలబిందెలు తవ్విన జాడల కోసం. లాయర్లు బేవారసు వారసత్వం గురించి వాకబు చేశారు. తిరుపతి హుండీలో నోట్లకట్టలు ప్రాయశ్చిత్తపు ముడుపులు పడ్డాయి. ఇన్‌కంటాక్సు ఆఫీసుకి బకాయి పన్నులు అనుకోకుండా కొన్ని జమపడ్డాయి.

జీతాల పాలసీలను చూసి నవ్వుతున్నాడని కొందరన్నారు. కాదు ప్రణాళిక రిపోర్టులో గణాంకాలు చూసి అని విమర్శకులన్నారు. కాదు. మీరు ఉపన్యాసాల డబ్బాలో చూపెట్టే 'కాశీపట్నం' చూసి అని అధికారులన్నారు. కాదు మీ మాటలు వినీ అని ధిక్కారులన్నారు. కాదు మొన్నటిదాకా ఆయన ముప్పై రెండేళ్ళు బతికేవాట్ట. ఇప్పుడు నలభై ఏడేళ్ళు బతుకుతున్నాట్ట... అది కాదు ధరల ప్రకారం బతకడానికెంత కావాలో లెక్కేసి, తాను బతికే ఉన్నట్టు దాఖలాలున్నాయి కాబట్టి తను రెండొందలు పైన గడిస్తున్నట్టు తేల్చుకొని, ఇన్నాళ్ళూ తన జీతం డెబ్బై నాలుగు మటుకే అని భ్రమ పడ్డందుకు నవ్వుకుంటున్నాడన్నారు. మీ మొహంలా ఉంది లాజిక్కు అని పక్కవాళ్ళు ఎత్తి పొడిచారు. రాజాజీ స్వతంత్ర పార్టీ లక్ష్యాలను వివరించారు. ఆమధ్య మినిస్ట్రీ తగాయిదాల్లో గవర్నమెంటు పన్లు మాని రైళ్ళలో తిరిగిన మాట నిజమే కాని, అది ఫార్సులా కనిపిస్తే, దానికిప్పుడు నవ్వడమే కాక నవ్వించడం సబబు కాదు అన్నారొక మంత్రిగారు ఆప్త మిత్రుడికేసి కోరగా చూసి.... నేను నవ్వించలేదు. నే నసలాయన్నెరగను అన్నాడు మిత్రుడు... అందుక్కాదు. మీ పార్టీలు సజావుగా లేవు. ఈ రాష్ట్రంలో చేతులు కలుపుతున్నారు. పొరుగు రాష్ట్రంలో భుజాలు కలుపుకున్నారు. ఇక్కడ శత్రువులు, అక్కడ మిత్రువులూ అని రాసింది ఒక పత్రిక.... 'మిత్రువులు' అనే మాట లేదు మీకు తెలుగు రాదు. ఈ దేశంలో చాలామందికి తెలుగు రాదు. తెలుగు నేర్చుకొని, నా పుస్తకాలు చదివి తెలుగు నేర్చుకోండి అన్నాడు ఒక కవి... మరే - బెంగాలీ వాళ్ళకీ, మరాఠీలకీ, సిక్కులకీ చాలామందికి రాదు అన్నాడు మిత్రుడు... నీ మొహం అనుకున్నారిద్దరూ... సంస్కృతంలో కూడా త్వంశుంఠంటే త్వంశుంఠ అనుకున్నారు. అభిప్రాయ భేదాలన్నీ పోగొట్టుకొని ఈ ఒక్క విషయంలో ఒక్క మాట మీద నిలిచి... పాలిటిక్సు మధ్య మీరిలా త్వంశుంఠ అంటూ సాహిత్య విమర్శలు చేసుకోడం బాగులేదు అని కోప్పడ్డాడో వుగ్రవేదవ... పిడకల వేట లెలా ఉన్నా మొత్తానికి నరసుగారి నవ్వు తీవ్ర స్థాయిని అందుకొంది. కారణం మీ పార్టీయే అంటే మీ పార్టీ అని పార్టీలూ, మీ గ్రూపంటే మీ గ్రూపని గ్రూపులూ, నువ్వంటే నువ్వు అని నేనులూ ఈ విమర్శలు విసిరాయి.

"మా దేశంలోనూ ప్రజాస్వామ్యం వస్తుంది. ఆలస్యం అయినంత మాత్రాన నవ్వడం మర్యాద కాదు. దీనివల్ల ఆసియా దేశాల ఐకమత్యమే దెబ్బతినవచ్చు" అని హెచ్చరిక చేశారు అయూబ్.

"ఇది ఇండియా అంతరంగిక విషయం. అయినా ఆయన కేదో జోకు తట్టి ఉండాలి. జీవితమే జోక్‌లా కనబడి ఉండాలి. దానికి విశేషార్థాలు చెప్పడం తప్పు" అన్నారు కృశ్చేవ్ లోపాయికారీ గోష్ఠిలో నవ్వుతూ.

ఆ నవ్వునీ ఈ నవ్వునీ కూడా నిరసిస్తూ చైనా ప్రతినిధి ఒక ప్రకటన చేసి, అల్బేనియాతో తమ ఏకీభావాన్ని పునరుద్ఘాటించారు.

ఫ్రాన్స్ అగ్రరాజ్యాలకు ఆక్షేపణ తెలిపింది. ఆ నవ్వుకి కారణం నిర్ధారణగా తేల్చేవరకూ తాము హైడ్రోజను బాంబుల పరీక్షలు ఒకటి రెండు కొనసాగించక తప్పదని డిగోల్ ప్రతినిధి ఒకరు ప్రకటించారు. ఈ వైఖరిని బ్రిటన్ నిరసించిన మర్నాడు, క్రితం రోజు ప్రకటన చేసిన వ్యక్తి అధికార ప్రతినిధి కాడనీ, ఆయన ఆ క్రితం రోజే మరొక పదవికి బదిలీ అయ్యారనీ ఒక ప్రకటన వెలువడింది. జవహర్లాల్‌జీ ఇకనైనా రాజీనామా ఇచ్చి తిరిగి పోటీ చెయ్యాలని జయప్రకాశ్‌జీ అన్నారు. మా పార్టీ నినాదాలను మీరు వాడడం న్యాయం కాదు అని ఆయనకి రాజాజీ నామా పత్రం అందింది. నా ఇష్టం అని డా. లోహియా ఒక సంగ్రహ ప్రకటన చేశారు. నరసుగారి నవ్వు పట్ల తమ వైఖరి ప్రకటిస్తూ ఒక తీర్మానం చేయబోయిన కమ్యూనిస్టు పార్టీ మండలి సమావేశం నిరవధికంగా వాయిదా పడినట్లు ఒక ప్రకటన వెలువడింది. పావలా ఇచ్చేవాడే తెలుగు సినిమాలను తిట్టడానికి అర్హుడు. నరసుగారు చూసిన లేటెస్టు పిక్చరు 'కాదు సుమా కల కాదు సుమా' అన్న పాటగల చిత్రం కాబట్టి ఆనాటి నుండి ఆయన పావలా ఇవ్వటం లేదని రుజువైనందువల్ల, ఆయన ఇలా తెలుగు సినిమాలను చూసి నవ్వడం అక్రమమని సినిమా ప్రముఖు డొకాయన ఒక పత్రికలో వ్యాసం వ్రాశారు, నరసుగారు నవ్వు మానేవరకు నిరసన వ్రతం పడుతున్నట్టు పంజాబు వగైరా రాష్ట్రాల నుండి వార్తలు వచ్చాయి. "నేను పెద్ద పార్టీ అధ్యక్షుణ్ణి. కావాలనుకున్న వాళ్ళని ఢిల్లీ రప్పించుకోగలను. నవ్వించాలనుకున్న వాళ్ళని పిలిచి నవ్వించగలను. వద్దనుకున్న వాళ్ళనీ నవ్వించగలను" అని ఒకాయన నిష్కారణం ప్రకటన చేశారు. ఇదెవరైనా కథగా రాస్తే డోసు మీరి బోరు కొడుతుందనే వాడినే గానీ... అన్నాడొక పరిశీలకుడు.

"అసలాయన్ని ఓ గదిలో పెట్టి, నవ్వడం అంటే ఏడవడం అనీ ఏడవడం అంటే నవ్వడం అనీ గట్టిగా నచ్చ జెప్పి నమ్మించాలి. అప్పుడు గనక ఆయన వెంటనే ఏడిస్తే ఆయన నిజంగా నవ్వుతున్నట్టు రుజువవుతుంది. అప్పుడు కూడా నవ్వుతూనే ఉంటే కారణాలను మనం తిరిగి అన్వేషించాలి" అంటూ, "నవ్వు – ఒక పరిశీలన" అన్న వ్యాసంలో ఒక సైకాలజిస్టు సూచన చేశాడు.

పాలక సభలో వాయిదా తీర్మానాలదాకా వెళ్ళింది కథ. ఒక కమిటీ వేశారు. నవ్వుకు కారణం ఈ క్రింది వాటిలో ఏదో తేల్చాలని ఆదేశిస్తూ ఆ సంఘాన్ని నియోగించారు. అవి: 1. హేళన, 2. ఆనందం, 3. మతిభ్రమణం, 4. పెంకెతనం, 5. ప్రతిపక్షాలు రెచ్చగొట్టడం, 6. జీతాలు వేళకి అందడం, అందిస్తామనడం, 7. రెండుగాని అంతకుపైగా గాని రూపాయల అప్పు దొరకడం, 8. పంచదార ధరలు తగ్గడం, 9 ఆంధ్రలో రైల్వేలపట్ల కేంద్రం వైఖరి, 10. గుల్హాతీ కమీషన్, 11. ముఖ్య ప్రతిపక్షంలో ఏకత, 12. కాంగ్రెసులో టిక్కెట్ల పంపకం, 13. పి.ఎస్.పి, 14. ఆస్పత్రులు, 15. దుఃఖం, 16. హాస్యరచనలు, 17. ఎన్నికలు, ప్రణాళికలు

(కలిపీ, విడిగానూ), 18. పంచవర్ష ప్రణాళికలు, 19. పావలా కూడా అప్పు దొరక్కపోవడం, 20. తెలుగు సినిమాలు, 21. మధ్యనిషేధం.

ఆరువారాల కాలపరిమితి తీరినా కమిటీ సమావేశాలకు అంతా జతపడనందువల్ల ఈలోగా చర్చలూ, వాయిదా తీర్మానాలూ ఎక్కువయినందువల్ల, కమిటీ ఊటీలో ఒక అత్యవసర సమావేశం జరిపి, నరసుగారి నవ్వుకు కారణం పై వాటిలో ఏదీ కాదనీ, కేవలం అలవాటు అనీ మెజారిటీ ఓటుతో తాత్కాలిక తీర్మానం చేసి నివేదికను అందజేసింది.

దరిమిలాను చర్చలు జరిపిన పిమ్మట, నివేదిక సత్యదూరం అని పలువురు పత్రికలలో వ్రాసినందువల్ల దానిని చూసి చాలామంది కొత్తగా నవ్వు ఆరంభించినందువల్ల, 'నరసుగారు నవ్వటంలేదనీ, కులాసాగానే ఉన్నారనీ' అధికార ప్రకటన వెలువడింది. ఆ చర్చ అంతటితో ముగించబడింది. దరిమిలాను కూడా ఆయన నవ్వుతూ ఉన్నాడు. కాని ఆ నవ్వు రహస్యం తేలలేదు. ఏడిసినట్టుంది మీ నవ్వు అని నలుగురూ అన్నా ఆయన నవ్వుతూనే ఉన్నాడు. మీది వట్టి శబ్దాశ్రయ హాస్యం అని తిట్టినా నవ్వుతూనే ఉన్నాడు.

ఆ తరువాత ఎలక్షన్‌లో రెండు పెద్ద పార్టీవాళ్ళు ఆయన్ని ప్రచార వస్తువుగా వాడుకుందుకు ప్రయత్నించి కొంతవరకు కృతకృత్యులయ్యారు. తరవాత కొద్దిరోజుల్లో ఆయన నవ్వు మాయమయిపోయింది" అని కత ముగించారు రావుగారు.

ఆయన తరఫున రామిరెడ్డిగారు నిట్టూర్చాడు. "సుబ్బరాజా! నువ్వేమన్నా చెప్పగలవా? నరసుగారు ఎందుకలా నవ్వాడు?" అని అడిగాడు.

"మీరు చివర చెప్పించిన దానివల్లనే! ఆయన్ని సూటు వేసుకోమనీ, నవ్వమనీ చెప్పి, తమకి ఓటేస్తే అంత దర్జాగా కులాసాగా అందరూ ఉంటారనీ, అందరి స్థితీ క్రమంగా ఆ స్థాయికి వస్తుందనీ ఒక పెద్ద పార్టీ వారు ఎలక్షన్‌లో పబ్లిసిటీ శాల్తీగా బుక్ చేసుకున్నారు. అదే వేషాన్ని అదే నవ్వుని వాళ్ళ ప్రతిపక్షాల వాళ్లు కూడా పబ్లిసిటీకి బుక్ చేసుకున్నారు. ఎదర వాళ్ళకి ఓటేస్తే జీవితం ఇంత దైన్యంగా, కృత్రిమంగా, విషాదకరంగా ఉంటుందనీ, అందుకు సాక్ష్యం ఆ నవ్వేననీ వీళ్లు నినాదం పెట్టారు. ఇలా రెండు చుక్కెదురు పార్టీలకు తన బక్కదేహం ఒక్కటే పనికొచ్చిందనీ, చిట్టచివరికి తన దరిద్రమే డబ్బు సంపాదించి పెట్టిందనీ, ఆయనకి నవ్వొచ్చింది. ఇలా రెండందాలా డబ్బు తీసుకొని రెండు పార్టీలకీ కూడా ప్రచార సాధనంగా ఊరేగబోతున్న తను ఓటేసినప్పుడు ఎవరికి వెయ్యాలీ అని సందేహం వచ్చి బతుకంతా బ్రహ్మాండమైన జోకుగా కనబడి నవ్వు ఆగింది కాదు" అన్నాడు సుబ్బరాజు.

"ఆయాసపడ్డావు. కాస్త దాహం పుచ్చుకో" అన్నాడు రెడ్డిగారు నవ్వి.

★ ★ ★